# రెక్కల్లేని పక్షులు

బలివాడ కాంతారావు



ఎవరనగలరు ఆ గున్నయ్య మంచి వాడని? అబద్ధాలకి అంతులేదు. అబద్ధాలాడానని వాడికి చింతలేదు. అదను లేకుండా అప్పులు చేసాడు. ఆ డబ్బును సారాగామార్చి నిప్పంటించాడు. అప్పుల్లో మునిగినా యెక్కడో తేలి "తీసుకపోనీ వడ్డీ" అని కట్టిన్నాడు కట్టాడు లేనినాడు దెబ్బలు తిన్నాడు. ఇంట్లో పెళ్ళాం వీధిలో ప్రణయం. వగలాడి పెళ్ళాం మొదట్లో వల్లమాలిన వయ్యారం చూపించబోయింది. దెబ్బలతో ఆ కాస్త వూడిపడింది. గట్టులాంటి ఇంటి గుట్టును వీధిలోనికి విరజల్లింది. గట్టు తెగిన చెరువులా పరువంతా వీధిలో పడింది! వీడితో విడాకులు పుచ్చుకొని పోయేసరికి పెళ్ళానికి ప్రాణంవుంది. పంతం నెరవేర్చుకుంది. అందుకే—

వీడికి... ఈ గున్నిగాడికి ఫైర్‌మన్‌గా వుద్యోగంలో చేరి పదేళ్ళైనా యింకా ఫైర్‌మన్‌గానే వున్నవాడికి- తనకంటే వెనుకచేరినవాళ్ళ చేత ఆర్డర్లు పుచ్చుకున్నవాడికి - జీతం అందుకున్నాడే అప్పులవాళ్ళు చుట్టూముట్టగా తనే మిగిలిన వాడు— నేలమీదపడగానే కన్నతల్లినే పోగొట్టుకున్న వాడు-తండ్రే "అడు నా కొడుకు కాదని" వదిలేసిన వాడు... ఏ చెరువు నీరు ఆ చెరువులో యింకినట్లు ఎవరు చేసినపాపాలు వాళ్ళకే పీల్చినట్లు...

వీడు...ఈ గున్నయ్య...అల్లం తిన వలసిన బతుకు—లోకాన్ని మోసగించి బెల్లం తింటున్నాడు. కూడువండి కూటాన పెట్టిన పెళ్ళాం పెట్టిన శాపాలు కాకపోతే...వాడికి పాపమ్మ దాపరించడమేమిటి? అందరికీ అందిపోయిన ఆడది. ఎందరి గోళ్ళగంట్లో తిన్న అనపకాయలాంటిది. ఒకచేతినుంచి విసరగా ఇంకో చేతిమీదపడి కవికిన యాపిలుపండు. ఒగ్గూమొగ్గూలేని బ్రతుకుతో రంగులు మార్చే వూసరవెల్లిది. గాలికి ఒరిగిపోయే రెల్లిదుబ్బు. వలపు కలకండను అందరికీ నైవేద్యం పెట్టగలిగిన వన్నెలాడి. ఎగిరెగిరి దేశాలు తిరిగివచ్చిన పక్షి. ఈనాడు రెక్కల్లేని పక్షి!

ఈ యిద్దరు చెడ్డవాళ్ళు... ఒకచోట చేరిన్నాడు— అందరూ అనుకున్నారు. ఎన్నో అనుకున్నారు. వెటకారంగా నవ్వుకున్నారు. ఈ కాలానికి దాని అవసరం వీడికేంవుంది? వీడు దేనికి పని కొస్తాడు? ఎన్నాళ్ళు వీని భోగం? తెలిసిన చరిత్రతో చరిత్రహీనులైన వీళ్ళిద్దరికీ లోకానికి తెలియని చరిత్ర కూడా వుంది.

పాపమ్మ పిల్లప్పుడు మా పెంకిఘటం. పెద్దయ్యాక పెళ్ళయాక పెంకితనం తగ్గే బదులు హెచ్చింది. చక్కనైన గైరమ్మలా, చుక్కల్లో చందమామలా వుండేది. బొడ్డుమల్లెలా బింకంగావుండేది. పెళ్ళాడిన మారాజు కాటుకకళ్ళవేపు కన్నుగీటి చూడకపోయినా, యెదుటివాడికి ఆశపడకండా కష్టంమీద ఆకలి గొన్న యవ్వనాన్ని అదిమిపట్టి వుంచేది.

తెల్లని వెన్నెల్లో — మల్లెలాంటి యౌవ్వనంతో తేజరిల్లిన పాపమ్మ, తీరని వలపులతో గుండె చల్లబడుతున్న రోజుల్లో ముకుందం చుట్టపుచూపు కొచ్చాడు. వచ్చినచుట్టం యింటికే కన్నం వేసాడు. ఇల్లాలికే గేలంవేసాడు. ఇంత గడుసు పాపమ్మ వివేకం వదలి వెర్రిగా వాడివెంట పడిపోయింది. చెట్టాపట్టా వేసుకుని తిరిగారు. గుసగుసల్తో గుట్టలన్నీ బయట పెట్టుకుంది. 'నీ నడక అందం, నీ నడుం సన్నం, నివ్వో రంభ,' అంటూనే ఆమెదగ్గరున్న బంగారమంతా

అంకించుకొని ఓ తెల్లవారుఝామున ముకుందం పరారయిపోయాడు.

పాపమ్మ యేడ్చింది. మతి తిరిగి పోయింది. ఆ తిరిగినమతి మళ్ళీ తిరిగి "నా నొసటిరాత" అనుకుంది. మనసు పాషాణం చేసుకుంది. చుక్కవేపుచూస్తే యింకా చుక్కలానేవుంది.వండు పక్కన వుంటే యింకా ఆరగించవలసిన పండు లాగే వుంది. ఇది పాపమని లేదు. అది పుణ్యమని లేదు. బతికిందే పుణ్యం. చేత నైంది చేస్తేనే కష్టాలన్నీ తగ్గించేమందు యువకుల పొగడ్తలకు పకపకా నవ్వింది. వాళ్ళ వికారాలను భరించింది.

కొంతకాలానికి కులుకు తగ్గింది. మెరుపు మాడింది. రమ్యమైన రంగైన అవయవాలు ముడుచుక పోతున్నాయ్. కప్పుచిరిగిన యిల్లులా ఒళ్ళయింది. ఇంత చిన్నవయసుల్లో అంత పెద్దచరిత్ర అల్లుకోగలిగిన పాపమ్మ- జాజిపూల గుత్తులతో జగాన్నంతా యిక వూరించ లేని పాపమ్మ అందాన్నంతా యిదివరలా పండువెన్నెలగా మార్చి, వర్షించలేని పా వ మ్మ మోసపడిన పాపమ్మ — మోసాన్నే మరచిపోయిన పాపమ్మ, అందరికీ అందిపోయిన పాపమ్మ ఆశ లకు అవస్థలను కల్పించిన వాళ్ళను, భరించిన పాపమ్మ— ఆ ఆశనే చంపు కున్న పాపమ్మ... ఆరోగ్యం, సంపద, ఆశ-ఏదీ మిగుల్చుకోలేని ఆసమయంలో ఎండాకాలంలో మంటలు చెరుగుతున్న రోజున ... ఒకసారి గగనమంతాగగ్గోలై ఆకాశగంగ బీటలుదేరిన భూమిపై దబదబ వర్షం కారినట్లు... గున్నయ్య పాపమ్మ పాకమీద వడ్డాడు. తొలిరాక, తొలి పరిచయం. తాగి రాలేదు.

"ఎందుకొచ్చావ్?"

"అందరికీ నానుసెడ్డ, అందరికీ నివ్వు సెడ్డ. సెడ్డోలిద్దరూ ఒకదగ్గిరుంటే మంచిపనేదైనా సేస్తామేమో?"

"నివ్వు యెప్పుడూ నిషాలోవుంటావు కదా? ఇప్పుడు—"

"నిషాలోవుండి నానాతప్పులుసేసినాను ఆ తప్పుల్లో ఒకతప్పు మా పెద్దతప్పు! నా పెళ్ళాం నన్ను వదిలేసి ఆర్నెల్లు అయిందిగదా?"

"ఎందు కొదిలేసింది ?"

"నన్ను భరించటం అంతసులువా? నాకు రోజస్తమానం నీతిగావుండమన్నది దాని నీతో...?"

"నా దగ్గర నీతేం మిగిలిందని వచ్చి నావు? నలుగురు నీకేసిన టెంకని" అంది.

"అలా ఒప్పుకోడమే నీతి. తప్పులు సేసి దాసుకోని దానివి. మంచిసే సేవుంటావు. ఆ మంచి సెప్పుకొని తిరగవు. అదీ మంచేనా? మనిసెరిగిందీ తక్కువే. ఎక్కువెరిగినట్లు సెప్పుకొని తిరగనేదు నా ఎలిపోయిన పెళ్ళంకన్నా నివ్వే మెరుగని వచ్చినాను......"

"నన్ను పెళ్ళాడ్డానికే?"

"నీకు పుస్తెమీద నమ్మకముంటే పద-లేకపోతే వద్దు."

కాస్సేపు అలా గడపలో కూలబడిన గున్నయ్య వేపు చూసింది. మనిషి బాగా చిక్కిపోయివున్నాడు.వుండీ వుండీ దగ్గు తున్నాడు. జుత్తు బుట్టలావుంది. కాకీ డ్రెస్సులో వున్నాడు. అక్కడక్కడా చిరుగులు. కాలి చెప్పులు బాగా అరిగి పోయాయి. గబగబయింట్లోనికి వెళ్ళింది. చెంబుతో నీరు తెచ్చిచ్చింది. తర్వాత తలరుద్ది నీరుపోసింది. తనకోసం వండి వుంచిన కూడంతా పెట్టింది.


"ఈ యాళ తాగుతావా?"

"ఈ ఒక్కరోజూ వద్దులే"

నులకమంచంవేసింది. నిద్దరవుచ్చింది. ఆమె తొడమీద తలపెట్టి నీరసంతో నిద్రపోయాడు. అలా యెంత రాత్రివరకో చీకట్లో కూర్చున్నా యేమూలో ఒక మూల, కనపడని దీపం వెలుగుతున్నట్లు వెలుగుపైకి చూసేసరికి చిల్లులుపడ్డపాక సందుల్లోనించి వెన్నెలవెలుగు పడ్తోంది. ఎక్కడో చినుకులు కాదు తనకళ్ళల్లోని రాని కన్నీరుబికి రాలుతోంది. ఆనందం! ఇలాంటి ఆనందం యివ్వటానికి... కొందరిపుణ్యాన కొడుకునైనా పుట్టలేదు. ఎవరికీ అందనిది గున్నయ్యకి అంది పోయింది. ఎవరినీ పొందనిది గున్నయ్యను పొందింది. ఈ అందాల పురుషుని పుణ్యాన ఆలు అయినట్లు మురిసిపోయింది. ఆ సంతోషం మళ్ళీ ఆశను గుండెగూటిలోనికి చేర్చింది. ఎండిపోయిన గడ్డిదుబ్బు యీ వానతో పచ్చనైంది. పోయిన ఆరోగ్యం, సంపదా దాగుడుమూతలు మాని చెంతచేరాయి.

మనిషి ఒకటైనా రెండుభాగాలు. ఒక్కొక్కభాగం యింకో భాగానికి విరుద్ధం. పాపమ్మ రెండు భాగాలూ ఒక్కటిగానే కనిపించాయి గున్నయ్యకు.

అబద్ధాలు అబద్ధాలుగా చెప్పుకోవటం నిజాలైపోతున్నాయ్. అవినీతికి కప్పిన




దాపరికపు తెరలు తొలగించటంతో —
నీతుల్లా మెరుస్తున్నాయ్.

లోకం యేమనుకుంటేనేం తనకి ? ఆనాడు పెళ్లాన్ని యిడాకు లిచ్చిన్నాడూ లోకం అంది. పాపమ్మను చేపట్టిన్నాడూ అంది. తను సచ్చిన్నాడూ అంటుంది. లోకంబాధ లోకంది. లోకులకు కోతుల్లాగా నాలుగు కాళ్లు లేవు. శివునిలా మూడు నేత్రాలూ లేవు. అందరిదీ తనలాంటి ఆకారమే—ఎవరిబాధా వాళ్లదైనా యెందుకో నవ్వుతారు. ఏదో ఒకమాట అనుకుంటారు. నవ్వినా, అన్నా, తన తోటివాడు జారిపోతున్నాడని యెందరు



చెయ్యి అందిస్తారు ? ఎందరి గుండెలు చలించి జారిపోయినవాడిని లేవనెత్తుతారు ? ఎందరినోట "రామ రామ" అన్నమాట వస్తుంది ? అలా మాట వచ్చిన నోళ్లెన్ని కట్టుకొని, బాధపడ్డ నోళ్లను నింపుతాయి ?

ఈ నాటికి అలా చెయ్యి అందించిన ఆడది గున్నయ్యకు దొరికింది. అలా లేవనెత్తిన మగాడు పాపమ్మకు దొరికాడు. విధో లేక వీధిలో మనుషులో రెక్కలు కత్తిరించినా మళ్ళీ యీ మనుషు లిద్దరికీ రెక్కలు వస్తున్నట్లు సంబరపడ్డారు. ఎగురుదా మనుకునేసరికి గున్నయ్య జబ్బుతో కూలిపోయాడు. మంచంపట్టినా మనిషి ముఖం వాడలేదు. రోగం ఆరోగ్యాన్ని తిన్నది గానీ ఆనందాన్ని తినలేదు. చివరవరకూ నవ్వుతున్నాడు. నవ్విస్తున్నాడు. వాడికి చచ్చిపోయేముందు, చచ్చిన తర్వాత నావాళ్లగతేంటన్న ప్రశ్నే లేదు. అంతకన్నా అదృష్టం యింకోటి లేదు. చావు కబురువిని తోటి వుద్యోగులు వచ్చారు. దహనక్రియలన్నీ వాళ్లే చేసారు. మిగతా మూడువందల చిల్లర పాపమ్మ చేతిలో




పోసారు. వాళ్ల ఆఫీసులో చావుఫండు వుంది. ఏ మెంబరు చచ్చినా ఒకచోట అదివరకుంచిన డబ్బులో యిది యిస్తారు. మరో రెండునెలలో ప్రావిడెంటుఫండు వెయ్యిపైగా వచ్చింది. గ్రాట్యూయిటీ—ఫేమిలీ పింఛను.

"ఆరునెలలు ఆడికింద పడిందో లేదో అంతా దోచుకుంది...దాని అదృష్టం" అన్నారు.

"అదేం పెళ్లం వీడికి...? ఎక్కడ పెళ్ళిచేసుకున్నాడు.?"

"వాళ్ల ఆఫీసు రికార్డుల్లో పాపమ్మ పెళ్లంగానే వుంది."

ఇలా మార్చని పాపమ్మ ఒకనాడూ పొరపాటునైనా అడగలేదు. అసలు అనుకోలేదు. వచ్చిన డబ్బుతో ఒక చిన్న బడ్డీ పెట్టింది. కిళ్ళీకొట్టు. పదిమంది మూగేవారు. పాపమ్మ అదృష్టం గురించి చెప్పుకునేవారు. కొన్నాళ్ల పోయాక ఆ బడ్డీకి ఆనుకున్న పాకలో చంటిపిల్ల యేడుపు వినిపించింది. పిల్లని ఓదారుస్తూ జోలపాటలు వినిపించేవి.

"పాపమ్మా యెవరీ పిల్ల ?"

"నా కూతురు...మల్లి..."

అందరూ యెదరగా కాక వెనుక నవ్వేవారు.

"దీనికేం కూతురు ? ఎక్కడ దొరికిందో యేంటో—ఆ కోతిపిల్ల."

ఆ పిల్ల పెంపకంలో శ్రద్ధతీసుకోవటంవల్ల పెరుగుతోంది. కండచేసాక కోతిపిల్లకాదు, ఆ పిల్లకు వాసన సబ్బు రాని స్నానం చెయ్యిస్తుంది. ఖరీదైన గౌన్లుకొని వేస్తుంది. రంగు రంగుల రిబ్బన్లు కట్టి జడవేస్తుంది. కిల్లీకొట్టుకు బాబులు ఎవరైనా వస్తే దండంపెట్టమ్మా అంటే—అది దండంపెట్టాది.

"నీ కూతురా ? మంచి అలవాట్లు నేర్పావే.. ?" అంటాడొక బాబు వెటకారంగా. పాపమ్మ వెటకారంగా తీసుకోదు. మురిసిపోతుంది.

ఈ కూతురు చరిత్ర తన కొక్కరికే యిప్పుడు తెలుసు. ఆ చరిత్ర యింకెవరికీ తెలీదు. ఆ వార్తే ఆ కూతురు పెద్దయ్యాకా తెలుసుకుంటే జీవితకాలం బాధపడ్తుంది. అందుకే యెవరికీ చెప్పదు.

గున్నయ్య పెళ్లానికి విడాకులు యిచ్చాక తాగుడు రెట్టించాడు. ఆ మైకంలో ఒకరాత్రి యెటెటో నడిచి పోయాడు. ఒక రోడ్డువార ఒక ఆడది, అడుక్కునేది కూర్చుంది. శరీరానికి పెద్ద రోగం పట్టినా ఆశలకూ కోరికలకూ రోగం పట్టలేదు. స్వాతివానకు కాచుకున్న అష్టవంకరుల ముత్యపుచిప్పలా వుంది. అంధకారంలో అంధుడయ్యాడు. తాగుడుమైకంలో తలనిండా మట్టిపెట్టుకున్నాడు. చలిలో వెచ్చదనం. ఆ వెచ్చదనం తెచ్చిన వుద్రేకపు వాతావరణంలో ఒక పువ్వు పూస్తే...తెలివి వచ్చాక చూసాడు ... గున్నయ్య ఒళ్లంతా కంపించిపోయింది. ఆవిడమాత్రం మిణుగురులా ఆ చీకట్లో మెరిసిపోయింది.

ఆనాటి రాత్రి మొగ్గతొడిగి యీనాటికి పువ్వయిన పిల్ల యిదే. ఈ పువ్వును రాల్చి ఆ చెట్టు యెండిపోయింది. రోగం కుళ్లబెట్టిన రెక్కలు మళ్ళీ రాలేదు. లోకమంతా వెలివేసిన పక్షి. ఆ రెక్కల్లేని పక్షికి గున్నయ్య పాపమ్మ రెండు రెక్కలై చివరిరోజుల్లో యెగిరించారు.

మనసు చంచలమైనది. మనస్సుగల మనిషి అప్పుడప్పుడు పొరపాట్లు చేస్తుంటాడు. రెక్కలు కత్తిరించుకుంటుంటాడు. మళ్ళీ స్వబుద్ధివలనో, తోటివాళ్ల కరుణవలనో,—మళ్ళీ రెక్కలు మొలుస్తుంటాయ్. అందుకే మనిషి యీ భూమిమీద యింకా బ్రతికేవున్నాడు.